సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 14 । జూన్ । 2024



హుండీ ఆదాయం రూ.57,13,100
చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. - 8లో



నిందితుడి అరెస్ట్
చిన్నారిని హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. - 8లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 24°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ, నార్కట్‌పల్లి: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నార్కట్‌పల్లి మండలం బి.వెల్లంల గ్రామంలోని హైస్కూల్‌లో నిర్వహించే నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నట్లు ఎంఈఓ నర్సింహా గురువారం తెలిపారు. అదేవిధంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన వారికి నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు సర్టిఫికెట్లను అందజేయనున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై గురువారం నల్లగొండలోని మున్సిపాలిటీ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు పూర్తి చేయడంలో జాప్యం చేయొద్దని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, మెప్మా పీడీ కరుణాకర్, ఎంఈఓ అరుంధతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కల్యాణ్‌చక్రవర్తి

మిర్యాలగూడ: వర్షాకాలం ప్రారంభంకావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ కల్యాణ్‌చక్రవర్తి తెలిపారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. సీజనల్, అంటువ్యాధులపై వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించి, జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

లాసెట్‌లో 74.55 శాతం ఉత్తీర్ణత

పెద్దవూర: లా అండ్ పీజీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్- 2024 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో 75.55 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. కోదాడలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 938 మందికి 756 మంది పరీక్ష రాయగా.. 558 మంది ఉత్తీర్ణత (73.81శాతం) సాధించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 503 మందికి గాను 441 మంది పరీక్ష రాశారు. 332 మంది ఉత్తీర్ణత(75.28శాతం) సాధించారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8 పరీక్షా కేంద్రాల్లో కలిపి లాసెట్‌లో 75.55 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

రేపు జాబ్ మేళా

మిర్యాలగూడ: మిర్యాలగూడెం పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లింగ్ ఆఫ్ రియాక్టర్, సెంట్రీఫ్యూజ్, డ్రైయర్స్, పౌడర్ ప్రాసెసింగ్ ఎక్విప్‌మెంట్‌లో ఉద్యోగాల కోసం 26 ఏళ్ల వయసు కలిగి బీఎస్సీ కెమిస్ట్రీలో 2020 నుంచి 2024వరకు పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా టెక్నికల్ ట్రైనీ, సెల్ఫ్ డ్రైవెన్ టీమ్స్‌లో 20 ఏళ్ల వయసు కలిగి 60శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్మీడియట్ పాసైన వారు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాకు పురుష అభ్యర్థులకు మాత్రమేనని అర్హులని, ఆసక్తి గల వారు ఈనెల 15న పాస్‌ఫొటో, బయోడేటా, ఆధార్‌కార్డు జిరాక్స్, విద్యార్హతల సర్టిఫికెట్లతో విజేత డిగ్రీ కళాశాలకు రావాలని పేర్కొన్నారు. వివరాలకు 79933 19545ను సంప్రదించాలని కోరారు.

పరీక్ష ఆలోచన విరమించుకోవాలి

నల్లగొండ టౌన్: ఆశవర్కర్లకు పరీక్ష నిర్వహించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించారని, ప్రస్తుతం వారికి పరీక్ష నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, చంద్రమౌళి, మహేశ్వరి, వెంకటమ్మ, సైదులు, సత్యనారాయణ, దయానంద్, కవిత, స్వర్ణ, వసంత, పార్వతమ్మ, అనూష, సలీమా, పుష్పలత, తాహెర్, ధనలక్ష్మి, రేణుక, సత్తమ్మ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

స్థానిక ఎన్నికలెప్పుడో..

- ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన
- ఇకపై మండల, జిల్లా పరిషత్‌లు కూడా వారి చేతుల్లోకే..
- జూలై 4వ తేదీతో ముగుస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం
- ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించకపోవచ్చనే చర్చ
- అక్టోబరులోనూ కష్టమేనంటున్న అధికార పార్టీ వర్గాలు
- పోటీకి సిద్ధమవుతున్న వారికి తప్పని నిరాశ

ప్రాదేశిక ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం పూర్తయి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. జూలై 4వ తేదీతో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం కూడా పూర్తి కానుంది. మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలంటే ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టాలి. ఆ సందడి కనిపించకపోవడంతో ఈ ఎన్నికలు కూడా జరగకపోవచ్చన్న చర్చ సాగుతోంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం 33 మండలాలు ఉన్నాయి. గతంలో జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు జరిగిన సమయంలో 31 మండలాలు ఉండగా.. వాటి పరిధిలోనే ఎన్నికలు జరిగాయి. 31 మండలాలకు 31 మంది జెడ్పీటీసీలు, 347 మంది ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ పాలకవర్గాలకు జులై 4వ తేదీ నాటికి అయిదేళ్లు పూర్తవుతున్నందున వాటి పదవీ కాలం పూర్తి కానుంది.



పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు కొలువు

అసెంబ్లీ ఎన్నికల ముందే గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం పూర్తయింది. ఆ ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారని అంతా భావించారు. అందుకు సంబంధించి ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే సర్పంచ్ ఎన్నికలకు వెళితే బాగుండదనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించింది. అలా చేస్తే తమ పార్టీకి కలిసి వస్తుందనే ఉద్దేశంతో అప్పట్లో గ్రామ పంచాయతీల ఎన్నికలను వాయిదా వేశారన్న చర్చ సాగింది. ఆ ఎన్నికలు వాయిదా పడటంతో పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన పెట్టక తప్పలేదు. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం ఆ ఎన్నికలు కూడా ముగిశాయి. అయినప్పటికీ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం కూడా బయటకు రావడం లేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా ఇప్పట్లో లేదా అనేది సందేహంగా ఉంది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు కూడా అంతేనా..

వచ్చే నెల 4వ తేదీతో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలక మండలి పదవీ కాలం ముగియనుంది. అయితే ఎన్నికలు నిర్వహించాలంటే నెల రోజుల ముందుగా ఆ ప్రక్రియ మొదలు పెట్టాలి. కానీ, పార్లమెంట్ ఎన్నికలు ఇటీవలే ముగిశాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ 5వ తేదీ నుంచి 3 రోజుల పాటు సాగింది. ఆ తర్వాత ఆ కోడ్ కూడా ముగిసింది. కానీ, ప్రభుత్వం మాత్రం అటు పంచాయతీ ఎన్నికలు, ఇటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి చర్యలు తీసుకున్నట్లుగా కనిపించడం లేదు. ఇప్పటికే పదవీ కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న పంచాయతీల తరహాలోనే జిల్లా , మండల పరిషత్‌లలో కూడా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండల జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలాలు ముగిసేందుకు 20 రోజులు మాత్రమే సమయం ఉంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించడమనేది సాధ్యం కాదనే అనిపిస్తోంది.

అక్టోబరులోనైనా జరిగేనా..

అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే చర్చ జరుగుతున్నా.. అది కుదరకపోవచ్చని అధికార పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో కులగణన చేసి బీసీ రిజర్వేషన్లను తేల్చాల్సి ఉంది. పోయినసారి జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గాయని బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈసారి బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. కులగణన చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయకుండా ఎన్నికలకు వెళితే బీసీ కులాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వమే కులగణన చేస్తామని తీర్మానం చేసింది. అలాగే ఆగస్టు 15వ తేదీలోపు రూ.2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేయకుండా మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ఓట్లు అడగడానికి అవకాశం ఉండదని ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలే చెబుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అక్టోబరులోనూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కుదరకపోవచ్చని అధికార పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి.

గొర్రెల డీడీలు వాపస్

- లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పశుసంవర్ధక శాఖ
- వడ్డీ భారం పడిందని గొల్లకురుమల ఆవేదన

నల్లగొండ అగ్రికల్చర్: గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టిన గొల్ల కురుమలకు ప్రభుత్వం డబ్బులు వాపస్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభించింది. ఈమేరకు లబ్ధిదారుల నుంచి జిల్లా పశు సంవర్ధక శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం లబ్ధిదారుల నుంచి డీడీలు స్వీకరించింది. ఒక్కో యూనిట్ ధర రూ.1,75,000గా, లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈమేరకు 2023లో జిల్లాలోని 7,891మంది గొల్ల కురుమల నుంచి వాటాధనం కింద రూ.43,750 చొప్పున డీడీల రూపంలో తీసుకున్నారు. డీడీలు చెల్లించి ఏడాదికి పైగా గడిచినా గొర్రెల యూనిట్ల పంపిణీపై ఊసేలేదు.

అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో అనేక అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. యూనిట్ల పంపిణీలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో ప్రస్తావించింది. ఈ అక్రమాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐతో విచారణ చేపట్టింది. గతంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలింది. ఇద్దరు రాష్ట్ర స్థాయి అధికారులు కూడా అరెస్టు అయిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీని నిలిపివేసింది. లబ్ధిదారులు చెల్లించిన వాటా ధనాన్ని తిరిగి వారికి వాపస్ ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించింది. దీంతో డీడీలు చెల్లించిన లబ్ధిదారులు డబ్బు వాపస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సూచించింది. ఇప్పటివరకు జిల్లాలో 2500 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ అనుమతితో 800 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డీడీ డబ్బులను జమ చేసే ప్రక్రియను జిల్లా పశుసంవర్ధక శాఖ ప్రారంభించింది. ఒకటి, రెండు రోజుల్లో వీరి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. మిగతా 1,700 మంది లబ్ధిదారుల వాటాల్లో కూడా రెండు రోజుల్లో కలెక్టర్ అనుమతితో డబ్బులు జమ చేయనున్నారు. ఇంకా మిగిలిన లబ్ధిదారుల డీడీల కోసం దరఖాస్తులు చేసుకున్న వెంటనే కలెక్టర్ అనుమతితో జమ చేయనున్నారు. దరఖాస్తు చేసుకోనివారు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



డీడీల వాపస్ ప్రక్రియ ప్రారంభించాం

గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులు డీడీల వాపస్ కోసం దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తులు చేసుకున్న వెంటనే డబ్బులు బ్యాంకు ద్వారా వారి ఖాతాల్లో జమ చేయిస్తాం. ఇప్పటికే కలెక్టర్ అనుమతితో 800 మంది లబ్ధిదారులకు డీడీ డబ్బులు జమ చేసే ప్రక్రియ ప్రారంభించాం.

– శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

వడ్డీ ఎవరు చెల్లిస్తారు..

గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు డీడీలు చెల్లించి ఏడాది గడిచింది. డీడీలు కట్టేందుకు అప్పులు చేసి డబ్బులు తెచ్చామని, ప్రస్తుతం గొర్రెలను పంపిణీ చేయకుండా డీడీ డబ్బులు వాపస్ చేస్తుండడంతో తెచ్చిన డబ్బులకు వడ్డీ మీద పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీడీలు కట్టి యూనిట్లు రాక అప్పులు పాలైన తమకు వడ్డీతో సహా డబ్బులు చెల్లించాలని గొల్ల కురుమలు డిమాండ్ చేస్తున్నారు.

భూనిర్వాసితులకు న్యాయం చేస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ

మర్రిగూడ: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న శివన్నగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న గ్రామస్తులు, రైతులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసారు. తమకు ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని కోరారు. ఈమేరకు త్వరలోనే నష్ట పరిహారం అందించి ఇళ్ల స్థలాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సత్తయ్య, వెంకటయ్య, ఉపేందర్, చంద్రయ్య, వెంకటేష్, జంగమ్మ ఉన్నారు.



శివన్నగూడ రిజర్వాయర్ భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి ధరణి, ప్రజావాణి తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి మాట్లాడారు. ధరణిలో టీఎం 33 మాడ్యూల్‌లోకి దరఖాస్తులు రాగానే నోటీసు జారీ చేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తప్పనిసరిగా తనిఖీ చేసిన తర్వాతే పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్‌ల లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించడంలో ఆర్డీఓలు పర్యవేక్షించాలని తెలిపారు. కోర్టు కేసులకు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో సర్వే సమస్యలు ఉంటే వాటి జాబితా రూపొందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులను నిర్దేశించిన 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ధర్నా

నల్లగొండ టౌన్ : వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన అన్ని రకాల వరి, పత్తి ఇతర విత్తనాలు అందుబాటులో ఉంచాలని బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఐపీఎస్ స్థాయి అధికారితో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని, పంట రుణాలు అందించాలన్నారు. ఎరువులు, విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించేందుకు అన్ని మండల కేంద్రాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతుభరోసా పథకం కింద వెంటనే రైతులకు ఎకరాకు రూ.7,500 చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నాయకులు జి.వెంకట్‌రెడ్డి, అశోక్ రెడ్డి, గుండ నవీన్‌కుమార్, పి.వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

ఈ భోజనం మాకొద్దు

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు వాసన పట్టిన అన్నం.. నీళ్ల చారు

- పట్టించుకోని డైటీషియన్
- ఆర్‌ఎంఓకు ఫిర్యాదు చేసిన రోగులు
- డైట్ కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేసిన సూపరింటెండెంట్

నల్లగొండ టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు మెరుగుపర్చడంతో పాటు రోగులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచింది. ప్రతి రోజు ఒక్కో రోగికి రూ.120 విలువ చేసే పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పేషెంట్లకు ఉదయం టిఫిన్, కిచిడి, బ్రెడ్, అరటి పండు, మధ్యాహ్నం అన్నం, కూర, చారు, గుడ్డు అందించాలి. రాత్రి చపాతి ఇవ్వాలి. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో డైట్ కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనంలో నాణ్యత లేకపోవడంతో రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాసన పట్టిన అన్నం, రుచి లేని కూరలు, నీళ్లచారు అందిస్తున్నారని పేర్కొంటున్నారు. వడ్డించే వారిని ప్రశ్నిస్తే ఈసడించుకుంటున్నారని వాపోతున్నారు. డైట్ కాంట్రాక్టర్ అందిస్తున్న నాణ్యత లేని భోజనం తాము తినలేమని గత వారం క్రితం మెడికల్ వార్డుకు చెందిన యాభై మంది పేషెంట్లు జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తికి, ఆర్‌ఎంఓకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు వారు తమ బంధువుల నుంచి అన్నం తెప్పించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై స్పందించిన సూపరింటెండెంట్ సదరు కాంట్రాక్టరుకు మెమో జారీ చేసినట్లు సమాచారం.



ఆస్పత్రిలోని మెడికల్ వార్డులో పేషెంట్లకు అన్నం పెడుతున్న సిబ్బంది





నాణ్యత లేని భోజనం, నీళ్ల చారును చూపుతున్న పేషెంట్లు

డైటీషియన్ ఏం చేస్తున్నట్లు..

జీజీహెచ్‌లో 550 బెడ్‌ల సామర్థ్యం ఉన్నప్పటికీ స్థాయికి మించి సుమారు 650 మంది ఇన్‌పేషెంట్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటారు. వారందరికీ మూడు పూటలా డైట్ సరఫరా చేయాల్సి ఉంటుంది. వారితో పాటుగా మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రి కాబట్టి సుమారు వంద మంది వరకు వైద్యులకు కూడా డైట్‌ను అందించాల్సి ఉంటుంది. డైట్ కాంట్రాక్టర్ సరఫరా చేసే అన్నం, కూరలు, చారు, పెరుగు, బ్రెడ్, పండ్లు, కోడిగుడ్లు తదితర అన్ని వస్తువుల నాణ్యతను డైటీషియన్ పరిశీలించాలి. కుళ్లిన, పాడైన వాటిని వండకూడదు. భోజనాన్ని డైటీషియన్ పరిశీలించి సర్టిఫై చేసిన తరువాతే రోగులకు, వైద్యులను అందించాల్సి ఉంటుంది. కానీ రోగులు ఈ వాసన పట్టిన అన్నం తాము తినలేమని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసారంటే ఆస్పత్రిలో పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. డైటీషియన్ ప్రతి రోజు డైట్‌ను పర్యవేక్షిస్తే వాసన పట్టిన అన్నం ఎలా సరఫరా చేస్తారని రోగులు ప్రశ్నిస్తున్నారు. డైటీషియన్ నిర్లక్ష్యం, అధికారుల అండదండల కారణంగానే డైట్ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. రోగుల జీవితాలతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు

జ్వరం కారణంగా వారం రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాను. ఇక్కడ పెట్టే అన్నం వాసన వస్తోంది. కూరలు, చారు బాగుండదు. వాసన చూస్తేనే వాంతి అవుతుంది. నాణ్యత లేని భోజనం పెడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ అన్నం తింటే రోగాలు పెరుగుతాయి తప్ప నయం కావు.

– లింగస్వామి, హాలియా

ఇంటి నుంచే తెప్పించుకుంటున్నా

కడుపునొప్పి రావడంతో ఈ ఆస్పత్రిలో చేరా. ఇరువై రోజుల నుంచి చికిత్స పొందుతున్నా. ఆస్పత్రిలో పెట్టే అన్నం తినలేక రోజూ ఇంటి నుంచే తెప్పించుకుంటున్నా. వాళ్లు పెట్టే అన్నం సగం మంది కూడా తినరు. బాగా లేకపోవడంతో చాలా మంది రోగులు బయటి నుంచి తెప్పించుకుంటున్నారు.

– కె. రమేష్, చిట్యాల

డైట్ కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేశాం

వారం రోజుల క్రితం రోగులు అన్నం బాగా లేదని, వాసన వస్తోందని ఆర్‌ఎంఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే డైట్ కాంట్రాక్టర్‌కు చార్జి మెమోను జారీ చేశాం. నాణ్యమైన డైట్‌ను అందించాలని ఆదేశాలు ఇచ్చాం. పూర్తిగా పర్యవేక్షణ చేయాలని డైటీషియన్‌ను కూడా ఆదేశించాం.

– డాక్టర్ రమణమూర్తి, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల ప్రక్రియ పూర్తి

నల్లగొండ: జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా మల్టీజోన్ పరిధిలో 129 మందికి పదోన్నతి లభించింది. నాలుగు రోజుల క్రితం విద్యాశాఖ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా షెడ్యూల్ విడుదల చేసింది. స్కూల్ అసిస్టెంట్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆర్‌జేడీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత సీనియారిటీ జాబితా ప్రకటించారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. జిల్లాలో అలాట్ అయిన వారికి పోస్టింగ్‌లు కూడా ఇచ్చారు. జిల్లాలో 109 గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీనియారిటీ జాబితా ప్రకారం జిల్లాలో 129 మంది స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు వచ్చాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న 109 పోస్టులకు 87 పోస్టులను జిల్లా నుంచి పదోన్నతులు పొందిన వారికి కేటాయించారు. ఇతర జిల్లాల నుంచి పదోన్నతిపై 22 మంది నల్లగొండ జిల్లాకు అలాట్ అయ్యారు. అదేవిధంగా 42 మంది పదోన్నతులు పొందిన నల్లగొండ జిల్లాకు చెందిన వారిని ఇతర జిల్లాలకు అలాట్ చేశారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలోని ఎరనాము కాలనీలో గురువారం కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. తాము ఇళ్ల ముందు ఉండగా.. కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయని బాధితులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

కంటైనర్‌లో 104 ఆవు దూడల తరలింపు

● రామాపురం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్న పోలీసులు

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు ఒకే కంటైనర్‌లో 104 ఆవు దూడలను అక్రమంగా తరలిస్తుండగా.. కోదాడ రూరల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా బాపులపాడు మండల పరిధిలోని హనుమాన్ జంక్షన్ నుంచి ఒకే కంటైనర్‌లో 104 ఆవు దూడలను కుక్కి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ క్రమంలో రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు కంటైనర్ ఆపి చూడగా ఆవు దూడలు కనిపించాయి. పట్టుబడిన ఆవు దూడలను హైదరాబాద్‌లోని జియాగూడలో గల గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మహ్మద్ అజీజ్‌ఖాన్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి

నల్లగొండ క్రైం: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ చెరువు(ఉదయ సముద్రం)లో జరిగింది. వివరాలు. నల్లగొండ పట్టణంలోని మాన్యంచెలకకు చెందిన అంజద్‌ఖాన్(25) తన స్నేహితుడు వాహిద్ అలీతో కలిసి బుధవారం సాయంత్రం చందనపల్లి గ్రామం వైపు పానగల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులో గుంతలు ఉన్న విషయం తెలియక గాలం వేసుకుంటూ ముందుకు వెళ్లిన అంజద్‌ఖాన్ గుంతలో పడిపోయాడు. అంజద్‌ఖాన్‌ను కాపాడేందుకు వాహిద్ అలీతో పాటు అదే సమయంలో అక్కడకు చేపలు పట్టేందుకు వచ్చిన పాలడుగు కృష్ణ ప్రయత్నం చేసినప్పటికీ అతడు మునిగిపోయాడు. బుధవారం రాత్రి వరకు అంజద్‌ఖాన్ కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. గురువారం మధ్యాహ్నం అతడి మృతదేహం చెరువులోని నీటిపై తేలింది. మృతుని భార్య నాజియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహమైంది.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

అడ్డగూడూరు: ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటన గురువారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరిగింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10మంది కూలీలు పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. తుప్పతి రాములు, నారబోయిన అంజయ్య, బాలెంల సోమయ్యపై తీవ్రంగా దాడి చేయడంతో వారిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చిన్నారి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

చివ్వెంల(సూర్యాపేట): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని చిన్నారిని నేలకేసికొట్టి హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా గుండారం మండల కేంద్రానికి చెందిన బొల్లంక అరవిందరెడ్డి అదే గ్రామానికి చెందిన రమ్య అలియాస్ నవ్యశ్రీతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రమ్యకు, ఆమె భర్తకు ఏడు నెలల క్రితం గొడవలు జరగడంతో ఆమె తన తల్లిగారి ఊరైన అదే జిల్లాలోని రంజల్ మండలం సాటాపూర్‌కు తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని వెళ్లింది. ఈ క్రమంలో అరవిందరెడ్డి 20రోజుల క్రితం రమ్య తల్లిగారి ఊరికి వెళ్లి ఆమెతో పాటు తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని బైక్‌పై చివ్వెంల మండల ఐలాపురం గ్రామానికి వచ్చి పరకాల పరుశరాములు ఇంట్లో ఒక గది అద్దెకు తీసకుని ఉంటున్నారు. అరవిందరెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రమ్యతో ఏకాంతంగా గడిపేందుకు ఆమె చిన్న కుమార్తె మహన్వి(22 నెలలు) అడ్డుగా ఉంటుందని అరవిందరెడ్డి ఆ చిన్నారిని కొట్టడం, కాల్చడం వంటివి చేస్తూ ఇబ్బందులకు గురిచేశాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రమ్య స్నానానికి వెళ్లిన సమయంలో చిన్నారిని కూలర్‌పై కూర్చోబెట్టి కిందకు నెట్టాడు. దీంతో చిన్నారి తల నేలకు తగిలి స్పృహ కోల్పోయింది. స్నానానికి వెళ్లి వచ్చిన రమ్యకు మెట్ల పైనుంచి పడిందని చెప్పడంతో వెంటనే హస్పిటల్‌కు తీసుకు వెళ్లారు. అప్పటికే చిన్నారి మృతిచెందిందని వైద్యులు తెలుపడంతో తిరిగి ఐలాపురం గ్రామం తీసుకొచ్చారు. రమ్య అత్త చిన్నారి మృతికి అరవిందరెడ్డి కారణమని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అతడు పరారయ్యాడు. గురువారం ఐలాపురం గ్రామంలో ఉన్న తన బైక్ తీసుకుని వెళ్లేందుకు అరవిందరెడ్డి రాగా పోలీసుల అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వై. సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బి. వెంకట్ రెడ్డి, ఏఎస్ఐలు వెంకన్న, నర్సయ్య, కానిస్టేబుళ్లు గోవర్ధన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న నగదు అప్పగింత



బాధితులకు నగదు అప్పగిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న నగదును పోలీసులు తిరిగి బాధితులకు అప్పగించారు. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండల పరిధిలోని ఫణిగిరి గుట్టోట్ వద్ద నివాసముండే ఆవుల శంభయ్య, లక్ష్మి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మేడారం, భద్రాచలం, కురివి తదితర ప్రాంతాలలోని దేవాలయాల వద్ద భిక్షాటన చేసి రూ.34వేల నగదు పోగు చేశారు. బుధవారం రాత్రి కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీలో బయల్దేరారు. రాత్రి 11గంటల సమయంలో హుజూర్‌నగర్‌లో దిగి నగదు, దుస్తులు ఉన్న సంచిని బస్సులోనే మర్చిపోయారు. బస్సు వెళ్లి తర్వాత సంచి లేదని గుర్తించి వెంటనే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ, హోంగార్డులు చిన్నప్ప, గోపయ్య కలిసి మిర్యాలగూడ ఆర్టీసీ డిపో సహకారంతో బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి నగదు, దుస్తులు ఉన్న సంచిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం నగదును సంచిని హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ బలరామిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో రూ.కోటి నగదు స్వాధీనం

నల్లగొండ క్రైం: నల్లగొండ రైల్వే స్టేషన్‌లో గురువారం ఆర్‌పీఎఫ్ పోలీసులు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళుతున్న పల్నాడు రైలు జనరల్ బోగిలో తనిఖీ నిర్వహించగా మిర్యాలగూడకు చెందిన ఒక వ్యక్తి దగ్గర రూ.కోటి 28 లక్షల నగదు లభించింది. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో రైల్వే పోలీసులు ఆ నగదును ఇన్‌కంటాక్స్ అధికారులకు అప్పగించారు. బంగారం కొనేందుకు హైదరాబాద్ వెళుతున్నట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు.

మహిళను బావిలోకి తోసేసిన యువకుడి అరెస్ట్

మోత్కూరు: మహిళను బావిలోకి తోసేసిన యువకుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా కేంద్రంలోని కాకినాడ బస్తీకి చెందిన మాటూరి కవిత, భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాకోళ్ల నర్సింహులు బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కవిత బంధువుల ఇంటికి వచ్చారు. వీరు స్థానికంగా ఉన్న పెద్ద చెరువు సమీపంలోని ముత్యాలమ్మ వ్యవసాయ బావి వద్ద ఈత కొట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో కవితను నర్సింహులు బావిలోకి నెట్టేయడంతో ఈత రాక ఆమె మృతిచెందింది. ఘటనా స్థలం నుంచి పారిపోయిన నిందితుడు నర్సింహులును గురువారం స్థానికంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నర్సింహులు, కవిత మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొట్టిన వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడిన కోటేశ్వర్‌రావు

కట్టంగూర్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన కోటేశ్వర్‌రావు కూలీ పనుల కోసం తన భార్య, కుమారుడితో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తన భార్య, కుమారుడిని రైలు ఎక్కించి బైక్‌పై అతడు గుంటూరుకు బయల్దేరాడు. మార్గమధ్యలో కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కోటేశ్వర్‌రావు తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎలికట్టె వాసికి డాక్టరేట్



మిర్యాల శ్వేత

చిట్యాల: మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన మిర్యాల శ్వేతకు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు గురువారం డాక్టరేట్ ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.వెంకటయ్య పర్యవేక్షణలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 'ప్రైవేట్ అండ్ గవర్నమెంట్ హాస్పిటల్స్ ఇన్ సెలెక్ట్ డిస్ట్రిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్ టు స్టడీ ద ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ స్లీప్ డిప్రెవేషన్ ఆన్ హెల్త్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. తన భర్త గంజి సంతోష్‌కుమార్ సహకారంతోనే డాక్టరేట్ పూర్తి చేసినట్లు శ్వేత తెలిపింది.

గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఎంపీ, ఆర్‌ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి తన క్యాంపు కార్యాలయంలో పీఎంపీ, ఆర్‌ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పానుగోటి హనుమంతరావు మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై పోలీసులతో కలిసి వచ్చి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సీఎంకు వివరించారు. తాము గతంలో ప్రభుత్వం నుంచి శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లను కూడా పొందామని, ప్రస్తుతం కూడా తమకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని సీఎంను కోరారు. వెంటనే తగిన న్యాయం చేస్తానని దాడులు నిలిపివేయిస్తామని సీఎం హామీ ఇచ్చారని వారు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుశృత గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకుడు డి. సత్యనారాయణచారి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కృష్ణయ్య, కార్యదర్శి కందగట్ల లక్ష్మణ్‌గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం


హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలంలోని చింతిర్యాల పునరావాస కేంద్రం శివారులో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 75 ట్రక్కుల ఇసుక డంప్‌ను స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సైదా పంచనామా నిర్వహించి ఇసుక డంప్‌ను పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అప్పగించారు. ఈ ఇసుకను త్వరలో వేలం వేయనున్నట్లు తెలిపారు.

గడ్డివాము దగ్ధం.. పోలీసులకు ఫిర్యాదు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో బుధవారం రాత్రి గడ్డివాము దగ్ధమైంది. గ్రామంలో మిడిదొడ్డి సరోజనమ్మకు చెందిన గడ్డివాము తన ఇంటి ఆవరణలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో దాదాపు 100కు పైగా గడ్డి మోపులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పలువురు అనుమానితులపై గురువారం ఆమమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కావాలనే గడ్డివాముకు నిప్పంటించారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఉత్తమ డాక్యుమెంటరీగా 'యూనిటీ'

● అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ – 2024కు ఎంపిక



యూనిటీ వాల్‌పోస్టర్

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు భోగ విజయ్‌కుమార్ దర్శకత్వంలో, చిరందాసు ధనుంజయ్య నిర్మాణ సారథ్యంలో రూపొందిన 'యూనిటీ– ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' చిత్రం పగేంట్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ –2024కు ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా ఎంపికైంది. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితచరిత్ర ఆధారంగా 'యూనిటీ–ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' చిత్రాన్ని నిర్మించారు. పగేంట్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌కు ప్రపంచ వ్యాప్తంగా 400 పైగా చిత్రాలు ఎంట్రీలు రాగా, అందులో 38 చిత్రాలు అవార్డు కేటగిరీకి ఎంపికయ్యాయి. కోల్‌కతాలోని స్టార్ థియేటర్ హాల్‌లో జులై 29 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించే చిత్ర ప్రదర్శనలో పురస్కారం అందుకోనున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

మనస్సును కదిలించిన వానర ప్రేమ



మృతిచెందిన కోతి వద్ద వానరాలు

పెద్దవూర : మనిషికి మనిషి సాయం చేయని ఈరోజుల్లో.. నోరు లేకున్నా మాకు మనస్సు ఉందని నిరూపించాయి రెండు వానరాలు. వివరాలు..మండలంలోని బెట్టలతండా వద్ద నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదానికి గురై ఓ కోతి మృతి చెందింది. రోడ్డుపై పడి ఉన్న ఆ కోతిని చూసి అటుగా వచ్చిన మరో రెండు వానరాలు రోడ్డు మీద నుంచి కదలించడానికి శతవిధాలుగా ప్రయత్నించాయి. మృతిచెందిన కోతి వద్దకు ఎవరినీ రానివ్వకుండా అడ్డుకున్నాయి. ఎటువంటి చలనం లేకపోవడంతో ఆ వానరాలు ఎటూ పాలుపోని స్థితిలో సుమారు గంటసేపు కొట్టుమిట్టాడాయి. మృతిచెందిన కోతిని ఎట్టకేలకు ఈడ్చుకుంటూ రోడ్డు పక్కన ఉన్న పొదల్లోకి తీసుకెళ్లాయి. ఈ ఘటన అక్కడ ఉన్న వారి మనస్సును కదిలించింది.

లాసెట్‌లో పోతునూరు వాసికి ఆరో ర్యాంక్



నెర్మటి అర్జున్‌రెడ్డి

పెద్దవూర: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన లాసెట్ ఫలితాల్లో పెద్దవూర మండలం పోతునూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఏనెమీదిగూడెం గ్రామానికి చెందిన నెర్మటి అర్జున్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంక్ సాధించాడు. నెర్మటి కోటిరెడ్డి, యాదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. నెర్మటి అర్జున్‌రెడ్డి చిన్న కుమారుడు. వీరిది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. అర్జున్‌రెడ్డి ఆరో తరగతి నుంచి ఏడో తరగతి వరకు మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు నల్లగొండలోని సాందీపని ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని వికాస్ జూనియర్ కళాశాలలో, జెబీఐఈటీ(జోగిన్‌పల్లి భాస్కర్ ఇనిస్టిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ)లో బీటెక్ పూర్తి చేశాడు. అర్జున్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.57,13,100



హుండీల్లోని నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. 78 రోజుల్లో రూ.57,13,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ట్రాఫిక్ సిగ్నల్స్ రెడీ..



నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్, సుభాష్ విగ్రహం, దేవరకొండ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం, ఎన్జీ కాలేజ్, వీటి కాలనీ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ రెడీ కానున్నాయి. గతంలోనూ నల్లగొండ పట్టణంలోని వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండగా.. రోడ్ల విస్తరణలో భాగంగా వాటిని తొలగించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ


పట్టుబడిన వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వివిధ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించారు. సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. 12 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించగా 8 వాహనాలను పలువురు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ వేలం ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.2.95 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రజిత, టీడీఎఫ్ సీఐ మల్లయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుకు రైతులు మొగ్గు





సజ్జ పంట

పెద్దవూర: వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు చిరు ధాన్యాల పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్రలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక లాభాలు పొందవచ్చునని ఇన్‌చార్జి ఏడీఏ సందీప్‌కుమార్ సూచించారు. చిరుధాన్యాలు రక్తపోటు, మధుమేహం, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి మేలు చేస్తాయని నిపుణులు కూడా చెబుతున్నారు. వానాకాలంలో సాగు చేసే చిరుధాన్యాలలో అవసరాన్ని బట్టి ఒకటి నుంచి రెండు తడులు ఇస్తే సరిపోతుంది.

1. జొన్న: వానాకాలంలో నల్లరేగడి, తేలికపాటి నేలలు జొన్న పంటకు అనుకూలం. ఈ సీజన్‌లో తొలకరి వర్షాలు కురవగానే వర్షపాతం ఆధారంగా జూన్ మొదటి వారం నుంచి జూలై చివరి వారం వరకు జొన్న విత్తుకోవాలి. విత్తడం ఆలస్యమైతే కాండం తొలుచే పురుగు ఉధృతి పెరుగుతుంది.

రకాలు: హైబ్రీడ్ రకాలైన సీఎస్‌హెచ్ 14, 16, 18, 21తో పాటు ప్రాచుర్యం పొందిన ప్రైవేట్ కంపెనీల హైబ్రీడ్ రకాలను సాగు చేయవచ్చు. హైబ్రీడ్ రకాలలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు. సాధారణ రకాలైన సీఎస్‌వీ 15, శ్రీశైల(పీఎస్‌వీ–56) రకాలు సాగు చేయవచ్చు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తే విధానం: ఎకరాకు 3 నుంచి 4 కిలోల జొన్న విత్తనం విత్తుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 12 నుంచి 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తకోవాలి.

విత్తనశుద్ధి: విత్తే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాములు థయోమీ థక్సం, మూడు గ్రాములు కాప్టాన్ లేదా థైరామ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువుతో పాటు 32–24–18 కిలోలు చొప్పున నత్రజని–భాస్వరం–పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

అంతర పంట: జొన్నలో కందిని అంతర పంటగా 2:1 నిష్పత్తిలో సాగు చేసుకోవచ్చు. విత్తిన 42 గంటల్లోపు లీటరు నీటికి 4 గ్రాములు అట్రజిన్ కలుపు మందును కలిపి పిచికారీ చేస్తే మొదటి దశలో వచ్చే కలుపును నివారించవచ్చు. జొన్నలో ఎక్కువ కష్టం కలిగించే మల్లె (కలుపు) నివారణకు లీటర్ నీటికి 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ లేదా 2.4–డి సోడియం సాల్ట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

2. సజ్జ: సజ్జ పంటను జూన్ రెండో వారం నుంచి జూలై మూడో వారం వరకు విత్తుకోవచ్చు.

రకాలు: ఐసీఎంహెచ్ 356(హైబ్రీడ్), పీహెచ్‌బీ3, ఏహెచ్‌బీ 1 పేరున్న హైబ్రీడ్ రకాలను సాగుకు ఎంచుకోవాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 45 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి కాప్టాన్ లేదా 3గ్రాముల థైరామ్ కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఒక టన్ను పశువుల ఎరువుతో పాటు ఎకరాకు వర్షాధార పంటకు 24–12–8 చొప్పున, నీటి వసతి కింద 32–16–12 కిలోల చొప్పున నత్రజని–భాస్వరం–పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువును రెండు దఫాలుగా పంట విత్తేటప్పుడు, విత్తిన 30 నుంచి 35 రోజులకు వేయాలి. రెండు సాళ్ల సజ్జ పంటకు ఒక సాలు కంది పంటను అంతర పంటగా వేసుకోవచ్చు. జొన్న పంటలో సూచించిన మాదిరి అట్రజిన్ కలుపు మందుతో కలుపును నివారించాలి. పంట కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సజ్జ పంట 70 నుంచి 80 రోజులలో కోతకు వచ్చి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

3. కొర్ర: కొర్రలను జూలై, ఆగస్టు మాసాలలో విత్తుకోవాలి. కొర్ర పంట 70 నుంచి 85 రోజులలో కోతకు వస్తుంది. కొర్రలో ప్రసాద్, కృష్ణదేవరాయ, శ్రీలక్ష్మీ, సూర్యనంది, ఎస్ఐఏ 3085, ఎస్ఐఏ 3156 రకాలు అనుకూలం. పప్పుశనగకు ముందు 70–75 రోజులలో సూర్యనంది కొర్రలు సాగు చేసి శనగ వేసుకుంటే నికర ఆదాయం పెరుగుతుంది.

విత్తనశుద్ధి: ఎకరాకు సాళ్లలో విత్తేతే 9 కిలోలు, వెదజల్లే పద్ధతిలో అయితే 4కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి కార్బండిజం 2 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసి సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన 20 నుంచి 25 రోజులకు సాళ్లలో అంతర కృషిచేసి కలుపు నివారించాలి.

ఎరువుల యాజమాన్యం : ఎకరాకు రెండు టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల నత్రజని, 17 కిలోల భాస్వరం వేసుకోవాలి.

4. రాగి: వానాకాలంలో రాగి పంటను జూలై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవచ్చు. రాగి పంట 80 నుంచి 115 రోజులలో చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన మారుతి, చంపావతి, 80 నుంచి 90 రోజుల్లో, మధ్య కాల రకాలైన సప్తగిరి, భారతి, గోదావరి, 100 నుంచి 115 రోజుల్లో, పీపీఆర్ 1012 రకం 115 నుంచి 120 రోజులలో పంట కోతకు వచ్చి ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి ఇస్తాయి. రాగిని నేరుగా విత్తనాన్ని వెదజల్లి నారు పెంచి నాటే విధానంలో సాగు చేయవచ్చు. ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని వరుసల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: నారుమడికి 640 గ్రాముల లెక్కన నత్రజని, భాస్వరం, 480 గ్రాముల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాలుగు టన్నుల పశువుల ఎరువులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోలు నత్రజని, 8 కిలోల పొటాష్, 12 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులు విత్తేటప్పుడు లేదా నాటేటప్పుడు వేసుకోవాలి. విత్తనాన్ని వెదజల్లేటప్పుడు భూమిని మెత్తగా తయారు చేసి విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత బల్లతో గాని, చెట్టు కొమ్మతో గాని చదును చేసుకోవాలి. విత్తిన వెంటనే మొలకలు రాక ముందు లీటర్ నీటిలో 3 మిల్లీ లీటర్లు పెండి మిథాలిన్‌ను కలిపి పిచికారీ చేయాలి. నాటిన 15 నుంచి 18 రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2,4–డీ సోడియం సాల్టును రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుని కలుపు నివారించుకోవాలి.